సాక్షి అనంతపురం

గురువారం । 3 । అక్టోబర్ । 2024



ద్రాక్ష.. ధర లేక క్షోభ

ద్రాక్ష రైతులు కుదేలవుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో ధరల్లేక ఆవేదన చెందుతున్నారు. 8లో



మద్యం పాలసీపై కన్నెర్ర

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మద్యం పాలసీపై మహిళా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.9°/22.7°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

టమాట ధర మరింత పైకి..

- మండీలో కిలో గరిష్టం రూ.74



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర మరింత పైపైకి ఎగబాకుతోంది. ఈ సీజన్‌లో గరిష్ట సూచీని తాకింది. బుధవారం కక్కలపల్లి మండీలో 15 కిలోల బాక్సు ధర ఏకంగా రూ.1,110 పలికింది. కిలో రూ.74 ప్రకారం అమ్ముడుబోయింది. రెండో రకం కిలో రూ.65 కాగా మూడో రకం టమాట కనిష్ట ధర రూ.50 పలికింది. కొంచెం నాణ్యత తగ్గినా కూడా 15 కిలోల బాక్సు ధర ఏకంగా రూ. 750 ప్రకారం అమ్ముడుబోవడం విశేషం. ఈ ఏడాది సీజన్ మొదలైన తర్వాత ఇవే అత్యధిక ధరలు కావడం గమనార్హం. మార్కెట్‌కు టమాట తక్కువగా వస్తుండటంతో గిట్టుబాటు ధరలు దక్కుతున్నట్లు చెబుతున్నారు. గత వారం రోజులుగా ధరలకు రెక్కలు రావడంతో రైతులకు గిట్టుబాటు అవుతోంది. ధరలు ఎప్పుడు పతనం అవుతాయో? ఎప్పుడు ఎకబాకుతాయో చెప్పడం కష్టంగా మారిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

కసాపురంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన కాశీవిశ్వేశ్వరాలయంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కే.వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం వరకూ, అదేవిధంగా సాయంత్రం 6.30 గంటలకు విశాలాక్షి అమ్మవారికి శ్రీసూక్తవిధాన సహస్రనామ త్రిశతి ఖడ్గమాల అష్టోత్తర శత నామ కుంకుమార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని శరన్నవ రాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

ఈకేవైసీ చేయించుకోండి

- రైతులకు డీఏఓ ఉమామహేశ్వరమ్మ సూచన



ఎర్రగుంట్లలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ

గార్లదిన్నె: జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని యర్రగుంట్ల, కమలాపురం, కొప్పలకొండలో ఈ క్రాప్ నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఈ క్రాప్ నమోదు తీరుపై ఆరా తీశారు. డీఏఓ మాట్లాడుతూ ఈకేవైసీ గడువు 4వ తేదీతో ముగుస్తుందని, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని కలిసి పూర్తి చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 9,427 మంది రైతులకు గాను 9,078 మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, వీహెచ్‌ఏలు శిరీషా, ఆమని, మల్లికార్జున రైతులు పాల్గొన్నారు.

మాత్రలకూ దిక్కులేదప్పా!



- ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో నిండుకున్న మందులు
- ఇండెంట్ పెట్టినా స్పందించని సర్కారు
- అత్యవసర మందులకూ దిక్కులేని పరిస్థితి
- బీ12 ఇంజెక్షన్లు లేక రోగుల విలవిల
- యాంటీబయోటిక్స్ లేక బయటికి చీటీలు రాస్తున్న వైద్యులు
- మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలోనూ మందుల కొరత
- గత ఐదేళ్లూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితే లేదు
- జ్వరాల సీజన్‌లో కొరత నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు



అనంతపురం సర్వజనాస్పత్రిలోని మందుల గది వద్ద జనం రద్దీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆస్పత్రుల్లో మందుల కొరత సామాన్య రోగులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కూటమి సర్కారు వచ్చి నాలుగు నెలలు కూడా నిండక ముందే మందుల నిల్వలు పూర్తిగా కరిగి పోయాయి. దీంతో రోగులు బయట షాపుల్లో కొనుగోలు చేస్తున్న దుస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో మందులపై అడిగితే 'విజయవాడ నుంచే రావడం లేదు.. ఇండెంట్ పెట్టాం' అంటున్నారు. అసలే జ్వరాల సీజన్ కావడంతో రోగులు మందులు లేక సతమతమవుతున్నారు. గడిచిన ఐదేళ్లు ఒక్క ఆస్పత్రిలో కూడా మందులు లేవు అనే మాట వినిపించలేదు.

మంత్రి సొంత ఇలాకాలోనూ దుస్థితి..

ప్రస్తుతం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సత్యకుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలోనే మందులు లేక డాక్టర్లు బయటకు చీటీలు రాస్తున్నారు. 25 రకాలకు పైగా మందులు లేవు. స్వయానా ఓ అమాత్యుడి నియోజకవర్గంలోనే ఇలాంటి దుస్థితి నెలకొనడం విస్మయానికి గురి చేస్తోంది.



❑ ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలింత పేరు జ్యోతి. యాడికి మండలం వెంకటాంపల్లి గ్రామం. బత్తలపల్లి ఆస్పత్రిలో సిజేరియన్ జరిగిన తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చింది. వైద్యం అందించడంలో భాగంగా సర్వజనాస్పత్రి గైనిక్ వైద్యులు జ్యోతికి పారాసిటమాల్ ఇంజెక్షన్లు, ఫైరోనార్మ్, పారాసిట్ ఇన్‌ఫ్యూజన్ ఐవీ తదితరాలు కావాలని చెప్పారు. సర్వజనాస్పత్రిలో ఆ మందులు లేకపోవడంతో గత్యంతరం లేక జ్యోతి కుటుంబీకులు ప్రైవేట్ మందుల షాపులో కొనుగోలు చేశారు. రూ.2 వేల వరకూ ఖర్చు అయ్యింది.

సూదికీ, దూదికీ దిక్కులేదు..

ప్రమాదాల్లో గాయపడిన వారికి కుట్లు వేయడానికి సూది, దూది అత్యవసరం. కానీ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇవి కూడా లేవు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన కొంత మంది రోగుల సహాయకులు బయటినుంచి దూది తెచ్చి డాక్టర్లకు ఇస్తున్నట్లు తేలింది. 2019 జూన్ నుంచి 2024 మార్చి వరకూ మందులకు లోటు లేకుండా ఉండేది. ఎప్పటికప్పుడు బఫర్ స్టాకు తెచ్చి పెట్టేవారు. ఇప్పుడేమో మందులన్నీ ఖాళీ అయ్యాయి. ఈ మందులు రావడానికి మరో మూడు మాసాలు పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిగో ఇప్పుడు అప్పుడు అంటూ జాప్యం చేస్తున్నారని ఓ పీహెచ్‌సీ డాక్టర్ వాపోయారు.

బయట షాపులో తెచ్చుకున్నా



ప్రసవం కోసం నా బిడ్డ రాజేశ్వరిని సర్వజనాస్పత్రిలో చేర్పించాం. బీపీ ఎక్కువగా ఉందని వైద్యులు చెప్పారు. కేవలం మూడు మాత్రలు ఇచ్చారు. స్టాక్ అయిపోయిందని చెప్పారు. దీంతో ఈ నెల 1న టవర్‌క్లాక్ సమీపంలోని ఓ మెడికల్ స్టోర్‌లో మందులు తెచ్చుకున్నాం. రూ.144 ఖర్చు అయ్యింది. దూరాభారం నుంచి వచ్చిన మాలాంటి వారితో ఇలా ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేయించడం సరికాదు.

– లింగమ్మ, టీ వీరాపురం, రాయదుర్గం

టైఫాయిడ్ మందులు లేవంటున్నారు



కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని కురాకుల తోటలో నివాసం ఉంటున్నా. ఒంటిమిద్ది అర్బన్ హెల్త్ సెంటర్లో టైఫాయిడ్ జ్వరానికి మందులు లేవంటున్నారు. గ్లూకోజ్ బాటిల్ పెట్టడానికి ఐవీ సెట్లు అందుబాటులో లేవు. ఇక్కడి నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోవాలంటే ఆటోకు రూ.100 ఖర్చు అవుతుంది.

– తిమ్మరాజు, కళ్యాణదుర్గం

ప్రైవేటుగా కొంటే డబ్బులు ఇప్పిస్తాం



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మందుల కొరత లేదు. 95 శాతం మందులు ఉన్నాయి. ఏదైనా ఇండెంట్ నమోదు చేయడంలో ఆలస్యమైతేనే మందుల జాప్యం జరుగుతుంది. రోగులు ఎక్కడైనా మందులు కొనుగోలు చేసి ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటాం. సర్జికల్ వస్తువులకు పెద్దగా కొరత లేదు.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఏయే మందులు ఆస్పత్రుల్లో లేవంటే..

మందు పేరు	ఏ జబ్బుకు
లాల్‌బటాలాల్ 2 ఎంఎల్ ఇంజెక్షన్	తీవ్ర రక్తపోటు/ హైపర్‌టెన్షన్
పిరిడాక్సిన్ క్లోరైడ్ 10 ఎంఎల్ ఇంజెక్షన్	నరాల బలహీనత, రక్తహీనత
క్లోటిమాజోల్	గర్భాశయ ఇన్ఫెక్షన్లకు
బూపావాకెయిన్ 4	లోకల్ అనస్థీషియా
అమినో యాసిడ్ 500 ఎంఎల్ ఇంజెక్షన్	గాయాలు మానడం, న్యూట్రిషనల్
ఫ్లూకనోజోల్ 200	అలర్జీ నియంత్రణకు
లాక్టోలోజ్ సొల్యూషన్	మలబద్ధకం
బీ12 1ఎంఎల్	ఎనీమియా
అమాక్సిలిన్ క్లావ్‌లిక్ యాసిడ్ 625 ఎంజీ	యాంటీబయోటిక్
అమాక్సిలిన్ క్లావ్‌లిక్	యాంటీబయోటిక్
బెటమెథాజోన్ 2	స్టెరాయిడ్స్
సిసినోకోలిన్ 10	పెయిన్ కిల్లర్
ఎల్‌పీ నీడిల్ 25 సైజ్	కుట్లు వేసే సూది
నైట్రో గైసెరిన్ 2	గుండె సంబంధిత
హైసోన్ బుటిలో బ్రోమైడ్ 2 ఎంఎల్	కడుపునొప్పి/ గ్యాస్ట్రిక్
గైకోపారిలేట్ ఇంజెక్షన్	తిమ్మిర్ల నియంత్రణకు
మెట్రోనిడజోల్ 100	బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు
నార్తొస్టిరోన్ 5 ఎంజీ	రుతుక్రమంలో వచ్చే లోపాల నియంత్రణకు
యాంటీబాక్టీరియల్ సూచర్1 సైజ్	ఆపరేషన్ సమయంలో కుట్టు వేసే దారం
అమాక్సిలిన్ క్లావ్‌లిక్	యాంటీబయోటిక్స్
పొటాషియం 625	యాంటీబయోటిక్స్
గ్లూకోపైరేలేట్ 2	యాంటీబయోటిక్స్
హైసైన్ బుటిల్‌బ్రొమైడ్ 2	యాంటీబయోటిక్స్
బెట్‌సామెథజోన్ 2	యాంటీబయోటిక్స్

స్వచ్ఛభారత్ అందరి లక్ష్యం కావాలి

రాప్తాడురూరల్: స్వచ్ఛభారత్ అందరి లక్ష్యం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్,ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు కక్కలపల్లి కాలనీ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో బుధవారం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య పరంగా ప్రజల భాగస్వామ్యంలో జిల్లా మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డును అంకితం చేస్తున్నామన్నారు. 155 సంవత్సరాలకు ముందు ఇదే రోజున దేశంలో ఒక మహానుభావుడు జన్మించాడని, దేశానికి అహింస, సత్యాగ్రహాలతో ప్రపంచ నాయకత్వాన్ని సాధించేందుకు మార్గ నిర్దేశం చేశారని, అతనే జాతి పిత మహాత్మా గాంధీ అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలు ప్రతినిత్యం పాటిస్తూ మన ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత స్వచ్ఛాంధ్రప్రదేశ్ అని నామకరణం చేసి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలను కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యే సన్మానించారు. కుందుర్పి కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వేస్టేజ్‌తో బొమ్మల తయారీ స్టాల్‌ను పరిశీలించి పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఎంపీడీఓ పుల్లయ్య, తహసీల్దార్ మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.



క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీలు పార్థసారథి, లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజా భాగస్వామ్యంతోనే విజయవంతం

అనంతపురం: ప్రజా భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. అనంతపురంలో బుధవారం ఆర్ట్స్ కళాశాల నుంచి ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వరకు జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా సైకిల్ ర్యాలీ'లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వచ్ఛత మే జన్ భాగీదారి' అనే అంశంపై రాష్ట్ర స్థాయి అవార్డును జిల్లా కైవసం చేసుకుందని, మచిలీ పట్నంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, డీఎస్‌డీఓ షఫీ తదితరులు పాల్గొన్నారు.

మేం గ్రామ స్వరాజ్యం తెస్తే.. నేడు మద్యం తెచ్చారు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం
- గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిలకు ఘన నివాళి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాయకులు

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోని జగనన్న నాయకత్వంలో వంద రోజుల పాలనలోనే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు వంద రోజుల పాలనలో మద్యం షాపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలసి ఘన నివాళి అర్పించారు. అనంతరం టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.99కే క్వార్టర్ అంటూ సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రచారం చేయడం దారుణమన్నారు. సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్య్రం కోసం గాంధీజీ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్..జై కిసాన్ నినాదంతో దేశాన్ని సంఘటితం చేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు హిందుత్వం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా వైఎస్సార్ సీపీ పాలనలో అడుగులు పడ్డాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి సంక్షేమ పథకాలను గడపగడపకు చేరువ చేశామని గుర్తు చేశారు. కానీ నేడు చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం వంద రోజుల పాలన అయ్యాక మద్యాన్ని అందుబాటులోకి తెస్తోందని విమర్శించారు. కర్నూలు జిల్లా పర్యటనలో పింఛన్ల పంపిణీ సందర్భంగా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చి రూ.99 కే క్వార్టర్ బాటిల్ అందిస్తామని సీఎం చంద్రబాబు మహిళలతో చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మత కలహాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింత సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థ్ నాయక్, కార్పొరేటర్లు రహంతుల్లా, కమల్‌భూషణ్, చంద్రమోహన్ రెడ్డి, లాలూ, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు, మీసాల రంగన్న, సాకే కుళ్లాయస్వామి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, ఖాజా, రాధాకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, జాహ్నవి రెడ్డి, భారతి, శోభాబాయి, శాంతి, శోభారాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

పదవీ గండం..మీటింగ్‌పై మౌనం!

- ఎస్కేయూ పాలకమండలి సమావేశం నిర్వహణపై స్పష్టత కరువు
- ఈ నెల 7 లోపు జరగాల్సి ఉన్నా ఎవరూ నోరుమెదపని వైనం
- పదవులు ఊడతాయనే భయంతోనే దాటవేస్తున్నారనే విమర్శలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వాస్తవంగా ప్రతి మూడు నెలలకోసారి తప్పనిసరిగా పాలకమండలి సమావేశం నిర్వహించాలి. సభ్యులకు వారం ముందే లిఖితపూర్వకంగా ఎజెండా తెలియజేయాలి. పాలకమండలికి సెక్రటరీ అయిన రిజిస్ట్రార్ ఇందుకు బాధ్యత వహించాలి. ఎస్కేయూలో మార్చి 2న పాలకమండలి సమావేశం జరిగింది. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో జూలై 8న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని క్యాంపస్ నుంచి తొలగించాలనే ఏకైక ఎజెండాతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో అక్టోబర్ 7లోపు మళ్లీ పాలకమండలి సమావేశం జరగాల్సి ఉన్నా, ఇప్పటిదాకా ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం.



పదవులు ఊడతాయనే భయంతో..

పాలకమండలి సమావేశాన్ని నిర్దిష్ట సమయంలో ఎందుకు నిర్వహించలేకపోతున్నారనే అంశంపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్కేయూలో రెక్టార్, రిజిస్ట్రార్ పదవులు కీలకమైనవి. ఈ రెండు పదవులనూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి కట్టబెట్టారు. బోధనేతర ఉద్యోగులైతే డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి వారికి రిజిస్ట్రార్ కుర్చీ అప్పగించవచ్చు. సీనియర్ ప్రొఫెసర్లలో నిష్ణాతులు లేకపోతే డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి వారికి కట్టబెట్టవచ్చు. కానీ నిబంధనలు తోసిరాజని ఏకంగా రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్ చేశారు. మరో వైపు సీనియార్టీలో టాప్-5 వారిని కాకుండా 16వ స్థానంలో ఉన్న వ్యక్తిని రెక్టార్ పదవిలో కూర్చోబెట్టారు. ఈ క్రమంలో ఈ విషయాలన్నింటిపైనా పలువురు వర్సిటీ ప్రొఫెసర్లు విద్యాశాఖమంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రార్, రెక్టార్లలో ఎవరో ఒకరిని తప్పించాలని ఉన్నత విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పాలకమండలి సమావేశం జరిగితే ఎవరో ఒకరికి ఉద్వాసన తప్పదనే భయంతో ఉద్దేశ పూర్వకంగానే వాయిదా వేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వీసీకి అదే గుబులు..!

కొత్త వీసీల నియామకానికి సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. ఎస్కేయూ వీసీ పోస్టుకు 75 మంది దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులన్నింటినీ స్క్రూటినీ చేసి ఒకరిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇందుకు సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ నుంచి ఒకరు, యూజీసీ నుంచి ఒకరు, వర్సిటీ పాలకమండలి నుంచి ఒకరిని సభ్యులుగా ఎంపిక చేస్తారు. ఈ కమిటీ ముగ్గురి పేర్లను ప్రతిపాదిస్తే గవర్నర్ ఒకరిని వీసీగా నియామకం చేస్తారు. సెర్చ్ కమిటీలో వర్సిటీ తరఫున నామినీగా ఒకరిని నియమించాలంటే పాలకమండలి సమావేశం జరగాలి. అయితే, కమిటీ నియామకమే ఆలస్యమైతే వీసీ నియామకం మరింత ఆలస్యం అవుతుందని, దీంతో ఉద్దేశపూర్వకంగానే పాలకమండలి సమావేశాన్ని నిర్వహించకుండా దాటవేత వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు 17 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లలో జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్ తన ఉద్యోగానికి కొన్ని రోజుల క్రితం రాజీనామా చేయగా, ఆయన్ని తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని నేరుగా మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సైతం నోట్ పంపారు. ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగస్వామి విధుల్లో ఉండగానే మరణించారు. దీంతో ఆయన భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలాంటి కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపాల్సి ఉన్నా, తమ పదవులు ఎక్కడ ఊడతాయోనన్న భయంతో పాలకమండలి సమావేశాన్ని వాయిదా వేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నేటి నుంచి టెట్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లా విద్యాశాఖ పరిధిలో మొత్తం 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతపురం విద్యా డివిజన్‌లో ఆరు, గుత్తి డివిజన్‌లో మూడు, బెంగళూరు నగరంలో మూడు కేంద్రాలు ఉన్నాయి. అన్ని పేపర్లకు 44,855 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. రోజూ రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. పరీక్ష కేంద్రానికి గంటన్నర ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. స్క్రైబ్స్ ఏర్పాటు చేసిన దివ్యాంగ అభ్యర్థులకు 50 నిమిషాలు అదనంగా సమయం కేటాయించనున్నారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులుంటే పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ అధికారిని కలిసి సరైన ఆధారాలు చూపించి నామినల్ రోల్స్‌లో సరి చేసుకోవాలని చెబుతున్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే సహాయ సంచాలకులు 94416 58134, పర్యవేక్షకులు 94948 36875, సీనియర్ సహాయకులు 90596 93676 నంబర్లకు ఫోన్ చేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

పరీక్ష కేంద్రాలివే...

- ఎస్ఆర్ఐటీ, రోటరీపురం బుక్కరాయసముద్రం మండలం
- అనంతలక్ష్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఇటుకలపల్లి, అనంతపురం
- శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్‌హెచ్ 44, హంపాపురం, రాప్తాడు మండలం
- శ్రీ బాలజీ పీజీ కళాశాల రుద్రంపేట, ఆలమూరు రోడ్, అనంతపురం
- పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రుద్రంపేట సనపరోడ్, అనంతపురం.
- నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషియల్ ఆక్షన్ ఇండియా, ప్లాట్ నంబరు 50, 51, 8వ క్రాస్, చిన్మయానగర్, అనంతపురం.
- తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల, వీరాపురం గ్రామం, కడప రోడ్, తాడిపత్రి
- గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్‌హెచ్-44, గుత్తి అనంతపురం గ్రామం
- సర్ సీవీ రామన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, భారత్ పెట్రోల్ బంకు పక్కన, అనంతపురం రోడ్డు, తాడిపత్రి.
- రైన్ క్లౌడ్ టెక్నాలజీస్, 47/1, గ్రౌండ్‌ఫ్లోర్, 11వ క్రాస్, బాలజీనగర్, తిగలరలపాళ్య మెయిన్ రోడ్, పీన్య రెండోస్టేజ్, బెంగళూరు.
- బిట్‌బైటెక్ సొల్యూషన్స్, సీ348, 3వ ఫ్లోర్, ఫస్ట్ మెయిన్, పోలీస్‌స్టేషన్ రోడ్, పీన్య ఫస్ట్ స్టేజ్, బెంగళూరు.
- మిలిస్టోన్ టెక్నాలజీస్, నంబర్ 40, 41,42, డాక్టర్ విష్ణువర్ధన్ మెయిన్ రోడ్, సుంకల్‌పాళ్య, మహవీర్ లేక్స్ అపార్ట్‌మెంట్ ఎదురుగా, కెంగేరి, బెంగళూరు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన కానిస్టేబుళ్లు

- అభినందించిన ఎస్పీ జగదీష్



దీపను సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జాతీయ స్థాయి పోలీసు క్రీడా పోటీల్లో యోగా విభాగంలో కాంస్య పతకం సాధించిన మహిళా కానిస్టేబుల్ జి.దీపను ఎస్పీ పి.జగదీష్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. చత్తీస్‌ఘడ్‌లోని భిలాయి పట్టణంలో ఉన్న అగ్రసేన్ భవన్‌లో సెప్టెంబర్ 23 నుంచి 27వ తేదీ వరకూ ఆల్‌ఇండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్‌లో యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో ఆర్టిస్టిక్ యోగా గ్రూపు మహిళా విభాగంలో అనంతపురం మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన జి.దీప పాల్గొని కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటారు. అలాగే గుంతకల్లు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్.పులిబాబు ఆర్టిస్టిక్ గ్రూపు పురుషుల విభాగంలో ఐదో స్థానం, ట్రెడిషనల్ యోగాసన పురుషుల విభాగంలో అనంతపురం డీటీసీకి చెందిన ఎం.చలపతి 15వ స్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, ఎస్‌బీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రేపు

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్ టీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 4న తాడేపల్లిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులందరూ తప్పక హాజరై, విద్యారంగంతో పాటు అసోసియేషన్ బలోపేతానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, జి.శ్రీధర్‌గౌడ్ కోరారు.

గొడవలకు దూరంగా ఉండాలి

అనంతపురం: సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు మంగళవారం రాత్రి పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ, ఎస్ఐ సమావేశమై మాట్లాడారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఒక్కసారి కేసుల్లో ఇరుక్కొంటే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. అంతేకాక ఈ ప్రభావం కుటుంబసభ్యులపై తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.


ద్రాక్ష.. ధర లేక క్షోభ

గిట్టుబాటు ధర లేక ద్రాక్ష రైతులు కుదేలయ్యారు. సాధారణంగా సంప్రదాయ పంటల కంటే ఉద్యాన పంటలే ఇప్పటి వరకూ కరువు జిల్లా రైతులను ఆదుకుంటూ వస్తున్నాయి. ఈ క్రమంలో అత్యంత ఖర్చుతో కూడుకున్న ద్రాక్ష పంటను సాగు చేసిన రైతులు ఈ సారి నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఎకరా విస్తీర్ణంలో ద్రాక్ష సాగు చేయాలంటే దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకూ ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనికి తోడు ఏడాది పొడవునా పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రైతులు అప్పులు చేసి అదనపు పెట్టుబడులు పెట్టారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర ఒక్కసారిగా పతనం కావడంతో ద్రాక్ష రైతులు కుదేలయ్యారు.



గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద విరగ్గాసిన ద్రాక్ష పంట

- గిట్టుబాటు ధర లేక ద్రాక్ష రైతు కుదేలు
- తోటలకే పరిమితమైన ద్రాక్ష దిగుబడి
- జిల్లా వ్యాప్తంగా 928 ఎకరాల్లో పంట సాగు



గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా 928 ఎకరాల్లో రైతులు ద్రాక్ష సాగు చేస్తుండగా అత్యధికంగా కూడేరు మండలంలో 344 ఎకరాల్లో సాగులో ఉంది. గతంలో మార్కెట్‌లో ధర కిలో ద్రాక్ష రూ.70 నుంచి రూ.80 వరకూ అమ్ముడు పోయింది. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40 లోపు వినియోగదారులకు లభ్యమవుతోంది. ఈ లెక్కన రైతు వద్ద కిలో రూ.20కు మించి అమ్ముడు పోవడం లేదు. ఇంత తక్కువకు పంటను అమ్ముకుంటే కనీస పెట్టుబడులు కదూఆ చేతికి అందవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏటా జిల్లాలో ద్రాక్ష పంట లావాదేవీలు రూ.కోట్లలో ఉండేవి. గత పదేళ్లుగా ధరలు తగ్గు ముఖం పడుతుండడంతో ద్రాక్ష రైతులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు.

పొలంలోనే పంట

జిల్లాలో ద్రాక్ష పంట గుత్తులుగుత్తులుగా విరగ్గాసింది. పంట ఆశాజనకంగా ఉన్న మార్కెట్‌లో గిట్టుబా టు ధర లేకపోవడంతో రైతులు కుదేలయ్యారు. వ్యాపారస్తులు సైతం తోటల వైపు కన్నెత్తి చూడడం లేదు. కొనుగోలు చేసేందుకు వచ్చిన కొద్ది మంది వ్యాపారులు కూడా తక్కువ ధరకే బేరమాడుతున్నారు. దీంతో పక్వానికి వచ్చిన ద్రాక్ష గుత్తులను రైతులు తోటల్లోనే వదిలేస్తున్నారు. దళారులు, వ్యాపారస్తులు అడిగిన ధరకు పంటను అమ్ముకుంటే కనీసం కూలీల ఖర్చులు కూడా గిట్టుబాటు కావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శీతల గిడ్డంగులు లేకపోవడం కూడా ద్రాక్ష రైతుల నష్టాలకు కారణంగా తెలుస్తోంది.

ధర లేక పంటను వదిలేశా

గత ఆరేళ్లుగా రెండు ఎకరాల్లో దిల్‌కుష్ రకం ద్రాక్ష పంటను సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. గతంలో మంచి ధర ఉండేది. దీనికి తోడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్రాక్ష పంటకు బీమా సౌలభ్యాన్ని కూడా కల్పించింది. దీంతో నష్టమనేది మేము చూడలేదు. ఈ సారి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. పెట్టుబడులు కూడా చేతికి దక్కని పరిస్థితి నెలకొంది. దీంతో పంటను తోటలోనే వదిలేశా.

– రైతు వెంకటశివారెడ్డి, తిమ్మంపేట

ఇన్సూరెన్స్ వర్తించదు

మార్కెట్‌లో ద్రాక్ష ధర పూర్తిగా తగ్గిన మాట వాస్తవం. గత పదేళ్లుగా ద్రాక్షకు గిట్టుబాటు ధర లేదు. పైగా జిల్లాలో ద్రాక్ష పంటకు ఇన్సూరెన్స్ కూడా వర్తించదు. ఏక పంటగా 2,500 ఎకరాల్లో సాగు చేస్తే ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.

– రత్నకుమార్, ఉద్యానశాఖ అధికారి, రాప్తాడు

జిల్లాలో ద్రాక్ష పంట సాగు ఇలా...

మండలం	ఎకరాలు
అనంతపురం రూరల్	63.07
ఆత్మకూరు	26.15
ఉరవకొండ	8.32
కణేకల్లు	50.12
కళ్యాణదుర్గం	27.80
కుందుర్పి	29.56
కూడేరు	344.08
కంబదూరు	13.46
గార్లదిన్నె	20.48
నార్పల	5
బుక్కరాయసముద్రం	37.58
బెళుగుప్ప	72.77
బొమ్మనహాళ్	5.46
రాప్తాడు	195.26
రాయదుర్గం	10.50
వజ్రకరూరు	2.39
శింగనమల	10. 23
శెట్టూరు	4.25

సర్దుబాటు చార్జీలతో ప్రజలపై భారం : సీపీఎం

అనంతపురం అర్బన్: విద్యుత్, ఇతర భారాలను ప్రజలపై పడకుండా చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి సర్దుబాటు చార్జీలను పెంచాలని నిర్ణయించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఖండించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022–23 ఏడాదికి గాను విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్‌పీపీసీఏ) రూపంలో సుమారు రూ.8,114 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపుతూ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణం ఉపసంహరించాలన్నారు. అలాగే 2023–24 ఏడాదికి సంబంధించి మరో రూ.11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీల భారాన్ని మోపేందుకు రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. ఈ లెక్కన వినియోగదారులపై రూ.20వేల కోట్ల భారాన్ని మోపేందుకు చంద్రబాబు సర్కార్ సిద్ధమైందన్నారు. ఏనాడో వాడుకున్న విద్యుత్‌కు... ఆ తరువాత కాలంలో అదనంగా వేసే సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు తొలగిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. అయినా వాటిని తొలగించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు.

జూదరుల అరెస్ట్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డులోని ఆంజనేయస్వామినగర్‌లో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన పక్కా సమాచారంతో బుధవారం అనంతపురం రూరల్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వెంకటస్వామి నూతన గృహంలో బాషా అనే వ్యక్తి ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్న తొమ్మిది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1.94 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

'కూటమి' మూల్యం చెల్లించుకోకతప్పదు

అనంతపురం అర్బన్: కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిరసన దీక్షలు చేపట్టాయి. సమితి కో-కన్వీనర్ యేసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ రాజారెడ్డి, కో-కన్వీనర్లు నాగేంద్రకుమార్, సురేష్ మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగంతో నాడు సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అడ్డదారిలో కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు సిద్ధపడిందని మండిపడ్డారు. నాడు పోరాటాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను నేడు అవే పోరాటాలతో ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక, ప్రజా సంఘాలపై ఉందన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం చేసిందన్నారు. ఉక్కు పరిశ్రమను నష్టాల్లో నెట్టడానికి మోదీ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి పరిశ్రమను మరింత నష్టాల్లోకి నెట్టివేస్తోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉక్కు పరిశ్రమను దారదత్తం చేసి వేలాది మంది కార్మికులను రోడ్డు పాలు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమన్నారు. ఉక్కు పరిశ్రమను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఓ వైపు ప్రచారం చేస్తూ... మరో వైపు 4,290 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్ర చేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కానివ్వబోమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన టీడీపీ, జనసేన పార్టీ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిలుపుదలకు ఎంపీలు పార్లమెంట్‌లో పోరాటం చేయాలన్నారు. లేకుంటే ప్రజాప్రనిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు రాజేష్‌గౌడ్, రామాంజి, కృష్ణుడు, చిరంజీవి, వెంకటనారాయణ, నాగరాజు, కుళ్లాయిస్వామి, వేమన, వీరేంద్ర, భాస్కర్ బాబు, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలంటూ దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మద్యం పాలసీపై మహిళల కన్నెర్ర

- మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం అర్బన్: మహిళల మాన ప్రాణాల కంటే మద్యం ఆదాయానికే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటని మహిళా సంఘాల ఐక్యవేదిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకురాళ్లు సావిత్రి, పార్వతిప్రసాద్, సరస్వతి మాట్లాడుతూ మద్యం నియంత్రించి మహాత్ముడి కలలను నిజం చేయాలన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలను ఏకంగా 3,396కు పెంచడం దారుణమన్నారు. గతంలో రాత్రి 8 గంటలకే మద్యం దుకాణాలు మూసివేసేవారని, తాజాగా రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. మద్యాన్ని నియంత్రించడం, నేరాలను అరికట్టడం, ప్రజల ఆరోగ్యం కాపాడడం, మహిళలు, పిల్లలపై హింస అరికట్టడం ముఖ్యమా? లేక ఆదాయం పొందడం ముఖ్యమా? అనేదానిపై ఇప్పటికైనా ప్రభుత్వ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన మద్యం అందిస్తామని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, ఆ మద్యం ప్రజల ప్రాణాలు తీయదని గ్యారెంటీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. హింసకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? అని నిలదీశారు. మద్యం పాలసీపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకురాళ్లు పద్మ, అనిత, చంద్రిక, రామాంజినమ్మ, శంషాద్, నారాయణమ్మ, అరుణ, లక్ష్మి, ఆవాజ్ నాయకులు వలి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



మద్యం సీసాలు పగులగొడుతున్న మహిళలు

మా నాన్న ఆచూకీ తెలపండి

- రైల్వే పోలీసులను అభ్యర్థించిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగి కుటుంబసభ్యులు



అదృశ్యమైన కృష్ణలింగన్న మడివాల్

గుంతకల్లు: రెండు నెలల క్రితం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో కనిపించకుండా పోయిన తమ తండ్రి ఆచూకీని తెలపాలంటూ స్థానిక రైల్వే పోలీసులను గుజరాత్‌లో స్థిరపడిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగి కృష్ణలింగన్న మడివాల్ కుటుంబసభ్యులు వేడుకున్నారు. కుమారుడు కుమార స్వామి తెలిపిన మేరకు... బళ్లారి జిల్లాకు చెందిన కృష్ణలింగన్న మడివాల్ ఆర్మీలో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత గుజరాత్‌లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో తరచూ బళ్లారికి వెళ్లేవారు.జూలై 31న గుజరాత్ నుంచి బళ్లారికి వెళ్లిన ఆయన అనంతరం తిరుగూ ప్రయాణంలో గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే గుజరాత్‌కు వెళ్లే రైలు మిస్ కావడంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మరుసటి రోజు వస్తానని తెలిపారు. అయితే మరుసటి రోజు కూడా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. స్పందన లేకపోవడంతో ఆగస్టు 14న గుంతకల్లుకు చేరుకుని జీఆర్‌పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు జూలై 31న సీసీ ఫుటేజ్‌లను రైల్వే పోలీసులు పరిశీలించి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతున్న కృష్ణలింగన్న మడివాల్‌ను గుర్తించారు. ఆ తర్వాత ఆయన ఎక్కడికి వెళ్లింది స్పష్టంగా లేదు. ఘటనపై అప్పట్లో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ కృష్ణలింగన్న మడియాల్ ఆచూకీని పసిగట్టలేకపోయారు. దీంతో తమ తండ్రి ఆచూకీ తెలపాలంటూ బుధవారం మరోసారి బాధిత కుటుంబసభ్యులు గుంతకల్లు రైల్వే పోలీసులను కలసి అభ్యర్థించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం : డీఆర్‌ఎం

గుంతకల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం డీఆర్‌ఎం కార్యాలయం, రైల్వే జంక్షన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే జంక్షన్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహన్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో మృతదేహం

బుక్కరాయసముద్రం: మండలంలోని హమాలీ కాలనీ వద్ద ప్రవహిస్తున్న హెచ్చెల్సీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని వెలికి తీసి పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని నిరార్ధరించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నలుపు రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్, జేబులో కీపాడ్ సెల్, ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్నాయి. గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96816, 9392 918291కు సమాచారం అందించాలని కోరారు.

తప్పు సరిదిద్దుకున్న వారే ఉత్తములు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

బుక్కరాయసముద్రం: సమాజంలో తప్పు చేయని వారు ఎవరూ ఉండరని, అయితే చేసిన తప్పును సరి దిద్దుకున్న వారే ఉత్తములని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రెడ్డిపల్లి జిల్లా జైలు, ఓపన్ ఎయిర్ జైలులో గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. అనంతరం జిల్లా జడ్జి న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు మహాత్మా గాంధీ అన్నారు. దేశంలో శాంతిని నెలకొల్పడానికి ఆయన ఎంతో శ్రమించారన్నారు. గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చెడు మాట్లాడకు, చెడు వినకు, చెడు చూడకు అనే గాంధీజీ సిద్ధాంతాలను పాటించాలన్నారు. జైల్లో మంచి అలవాట్లు అలవర్చుకుని బయటకు వెళ్లాక ప్రశాంత జీవనం గడపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. మహిళా ఖైదీలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, ఓపెన్ ఎయిర్ జైలు సూపరిండెంటెడ్ చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దేవి, నాబార్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ అనూరాధ, జైలర్లు మధుసూధన్‌రెడ్డి, అప్పలనాయుడు, నాగరాజు, మధు సూధన్‌రెడ్డి, డాక్టర్ వినోద్‌కుమార్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన పప్పుశనగకు రిజిస్ట్రేషన్లు

- మండలాల వారీగా విత్తన కేటాయింపులు
- తాడిపత్రి డివిజన్‌కు 8,100 క్వింటాళ్లు
- తక్కువ రాయితీపై మండిపడుతున్న రైతులు



విత్తన పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: నల్లరేగడి భూముల్లో రబీ పంటగా పప్పుశనగ సాగు చేసే రైతులకు రాయితీ విత్తన పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో గురువారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కే) రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ప్రకటించారు. ఏపీ సీడ్స్ ద్వారా విత్తన సేకరణ, సరఫరా చేయగానే ఈనెల 10లోపు పంపిణీ మొదలు పెట్టవచ్చని చెబుతున్నారు. జిల్లాకు కేటాయించిన 27,139 క్వింటాళ్లను సాగు విస్తీర్ణంను బట్టి మండలాల వారీగా విత్తన కేటాయింపులు చేశారు. అత్యధికంగా పుట్లూరు మండలానికి 3,400 క్వింటాళ్లు కేటాయించగా, గార్లదిన్నెకు అత్యల్పంగా 50 క్వింటాళ్లు ఇచ్చారు. మొత్తంగా తాడిపత్రి డివిజన్‌కు 8,100 క్వింటాళ్లు, ఉరవకొండ డివిజన్‌కు 6,900 క్వింటాళ్లు, రాయదుర్గం డివిజన్‌కు 5,400 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం డివిజన్‌కు 2,300 క్వింటాళ్లు, గుత్తి డివిజన్‌కు 2 వేల క్వింటాళ్లు, అనంతపురం డివిజన్‌కు 670 క్వింటాళ్లు అలాట్ చేశారు.

22 మండలాల్లో పంపిణీ..

విత్తన పప్పుశనగ పంపిణీకి 22 మండలాల్లో ఏర్పాట్లు చేశారు. అనంతపురం, ఆత్మకూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, బెళుగుప్ప, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుత్తి, పెద్దవడుగూరు, పామిడి, శింగనమల, యాడికి, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండల పరిధిలో విత్తన పంపిణీ చేయనున్నారు. జేజీ–11 రకం విత్తన పప్పుశనగ క్వింటా ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోనూ రైతులు తమ వాటా కింద రూ.7,050 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు భూ విస్తీర్ణం బట్టి గరిష్టంగా 200 కిలోలు (10 ప్యాకెట్లు) పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎక్కడికక్కడ ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను సంప్రదించి తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఇదిలా ఉంటే, కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో విత్తనంపై కేవలం 25 శాతం రాయితీ ఇవ్వడంపై కూటమి ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు భరోసా, ఉచిత పంటల బీమాతో లబ్ధి చేకూరుస్తూనే విత్తన పప్పుశనగపై 40 శాతం రాయితీ ఇచ్చారని గుర్తు చేసుకుంటున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ఒనగూరిన ప్రయోజనాలు శూన్యమని వాపోతున్నారు.

'జిల్లా పరిషత్'లో ఉద్యోగుల సందడి

అనంతపురం సిటీ: బదిలీ ఉత్తర్వుల కోసం తరలి వచ్చిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ కార్యాలయం బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కిటకిటలాడింది. బదిలీల నోటిఫికేషన్ జారీ కాగానే మొత్తం 274 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 40 మంది ఎంపీడీఓలు, 234 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులోనూ ఒకేచోట ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగులు 103 మందిలో ఆరుగురు ఎంపీడీఓలు, 97 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు ఉన్నారు. ఆరుగురు ఎంపీడీఓలతో పాటు 97 మంది మినిస్టీరియల్ స్టాఫ్‌ను బదిలీ చేస్తూ జెడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్ల పూర్తి కాకుండా వివిధ కారణాలతో రిక్వెస్ట్ బదిలీలకు మొత్తం 153 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 34 మంది ఎంపీడీఓలు, 119 మంది మినిస్టీరియల్ ఉద్యోగులకు స్థానచలనం కలిగించారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద 27 మంది మినిస్టీరియల్ ఉద్యోగులను బదిలీ చేశారు. వీరందరికీ బుధవారం బదిలీ ఉత్తర్వులు అందించారు. కాగా, బదిలీల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు నుంచే ఓ ఉద్యోగి క్యాడర్‌ను బట్టి రేటు నిర్ణయించి వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బలమైన సామాజిక వర్గానికి చెందిన సదరు ఉద్యోగి కూటమి ప్రభుత్వం రాకతో తనకు ఎదురు లేదని విర్రవీగుతున్నట్లు జెడ్పీ ఉద్యోగులు బాహాటంగా ఆరోపించారు.

దార్శనికుడు మహాత్మా గాంధీ


జెడ్పీ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


నగరపాలక సంస్థలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ వసీం


మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సిటీ: సత్యం, సామరస్యం, సమానత్వం అనే మూడు సిద్ధాంతాలతో మహాత్ముడి జీవితం గడిచిందని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. భరత జాతి అభ్యున్నతి కోసం అహింసను ఆయుధంగా చేసుకుని మహాత్ముడు అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. గాంధీజీ చూపిన బాటలో పయనిస్తూ.. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనముందున్న కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో సీఈఓ చిలంకూరు ఓబులమ్మ, డిప్యూటీ సీఈఓ లలితాబాయి, జెడ్పీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: మహాత్ముడి ఆదర్శాలు అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ తిరువీధుల జగదీష్, పిన్ని నాగరత్నం ఆధ్వర్యంలో బుధవారం పాతూరులోని గాంధీ విగ్రహం వద్ద పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ గాంధీజీ పెట్టిన భిక్ష అని, ఆనాడు మహాత్ముడి వెంట నడిచి ప్రాణాలర్పించిన మహనీయులను నిత్యం స్మరించుకోవాలన్నారు. గోపామచ్చానరసింహులు ఆధ్వర్యంలో కొత్తూరు టవర్‌క్లాక్ వద్ద ఉన్న మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతపురం అర్బన్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతిపిత చిత్రపటానికి ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్ర కుమార్, సురేష్, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్‌టీ(ఏ) ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తామని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, వెంకట రమణప్ప, రాధాకృష్ణారెడ్డి, గోపాల్, కృష్ణ నాయక్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీఐటీ కళాశాలలో..

రాప్తాడు: అహింసా మార్గంలో బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టిన జాతిపితను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్వీఐటీ కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హంపాపురం సమీపంలో ఎస్వీఐటీ కళాశాలలో గాంధీ జయంతి నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కళాశాల మైదానాన్ని శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ వెన్నపూస శివా రెడ్డి, వైస్ పిన్సిపల్ విజయ భాస్కర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ హేమ సాగర్ పాల్గొన్నారు.

'ఎస్కేయూ' కళాశాలలో..

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్కేయూ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ అంటే స్వచ్ఛత, ధైర్యం, సర్వమత సమానత్వం, శాంతి, మానవతావాదం గుర్తుకొస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ పీఓలు జి.ఆనంద్ బాబు, ఎస్.పురుషోత్తం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చందన, వర్షిత, తరుణి, నూతన, లోహిత పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీజీ జయంతి జరుపుకున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో చెత్తను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనంతపురం: అహింసో పరమోధర్మ అని ఎలుగెత్తి చాటిన అంతర్జాతీయ దార్శనికుడు మహాత్మా గాంధీ అని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, ఎస్బీ సీఐలు ధరణి కిశోర్, క్రాంతికుమార్, రాయదుర్గం రూరల్ సీఐ వెంకట రమణ, ఆర్ఐ రాముడు, కణేకల్లు ఎస్ఐ నాగమధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ అనిత నివాళులర్పించారు.


ఎస్కేయూలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళి


మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి


రాప్తాడు: ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో..


ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి


గాంధీ జయంతిలో పాల్గొన్న జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ రెడ్డి

బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

అనంతపురం కార్పొరేషన్: బాపూజీ ఆశయాలను కొనసాగిద్దామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు అందరినీ ఏకతాటిపై తెచ్చి అహింసతో దేశానికి స్వాతంత్య్రం సాధనలో మహాత్మా గాంధీ ఎంతో కృషి చేశారన్నారు. అహింసా వాదంతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఏసీపీ మారుతీ హరిప్రసాద్, డీఈ దాక్షాయని, కార్పొరేటర్లు కమల్ భూషణ్, లాలూ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం కార్యదర్శి ఖాజా, నాయకులు కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు. అలాగే డీఎంహెచ్‌ఓ, ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమాల్లో డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, వైద్య కళాశాల ప్రిన్సిపల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడారు. అహింసతోనే మనం ఏదైనా సాధించగలమని స్వాతంత్య్రాన్ని తీసుకువచ్చిన ఘనత గాంధీజీదే అన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ కార్యాలయ పరిపాలనాధికారి గిరిజ మనోహర రావు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనాధికారి గంగాధర్, సీసీ వేమారెడ్డి, సూపరింటెండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గాంధీ, స్వామి వివేకానంద, అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్ రామ్, తెలుగుతల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను శుభ్రం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో డాక్టర్ రొనాల్డో, హర్షశ్రీ విష్ణు, శ్రీసాయి, పరిణీతసాయి, నిత్యశ్రీ, తరుణ్‌లు విజేతలుగా నిలిచారు.

క్లుప్తంగా

ఘనంగా 'లియాఫీ' ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరించిన ఎల్ఐసీ ఏజెంట్లు

అనంతపురం అగ్రికల్చర్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) ఆవిర్భావ వేడుకలు బుధవారం స్థానిక బ్రాంచ్-1, బ్రాంచ్-2 కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. జాతిపతి మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా లియాఫీ దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఏజెంట్ల సమాఖ్య నాయకులు తెలిపారు. బ్రాంచ్-1 కార్యాయలంలో మేనేజర్ భరత్, బ్రాంచ్-2 కార్యాలయంలో మేనేజర్ మధుబాబు తదితరులు లియాఫీ జెండాను ఎగురవేశారు. ఎల్ఐసీ ద్వారా అందిస్తున్న సేవలు, లియాఫీ ఆవిర్భావం, ఏజెంట్ల సేవలపై వివరించారు. కార్యక్రమాల్లో లియాఫీ నాయకులు తిరుపతయ్య, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జగదీశ్వర రెడ్డి, వేణుగోపాల్, ఆదిశేషయ్య, జగదీష్, వెంకట నారాయణ, ముసలప్ప, వన్నూర్‌వలీ, వెంకటేసులు, మల్లికార్జునయ్య, పెద్దన్న, నాగరాజారావు పాల్గొన్నారు.

'వేధింపులు తాళలేకే రాముడు ఆత్మహత్య'

అనంతపురం: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక దళిత రాముడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆరోపించారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత రాముడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అదే గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారులు అవసరానికి కొంత డబ్బు ముట్టజెప్పి మూడింతలు వడ్డీ కట్టాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రాముడు ఇంటిని సైతం బెదిరించి స్వాధీనం చేసుకున్నారని అతడి భార్య నాగమ్మ, కుమారుడు రాకేష్ చెప్పినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో దళిత రాముడు మృతదేహానికి ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

గాంధీ మార్గం అనుసరణీయం


మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్

అనంతపురం ఎడ్యుకేషన్: సమకాలీన రాజకీయాలకు గాంధీ మార్గం అనుసరణీయమని పీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనమల ఆధ్వర్యంలో బుధవారం 'సమకాలీన రాజకీయాల్లో గాంధీజీ పాత్ర' అనే అంశం నగరంలోని ఓ ప్రైవేట్ బాలికల కళాశాలలో సెమినార్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సాకే శైలజానాథ్, డాక్టర్ పోతుల నాగరాజు హాజరై మాట్లాడారు. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కల్పించడం కోసం సత్యం, అహింస అనే ఆయుధాలతో గాంధీజీ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఓబులేసు, కళాశాల ప్రిన్సిపల్ భవాని, యువజన కాంగ్రెస్ నాయకులు గిరీష్, పవన్, బిందు పాల్గొన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపుర ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ 1938) 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరం వేదికగా రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆ శాఖ నాయకులు విడుదల చేసి, మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం లక్ష్యాలుగా 80 సంవత్సరాలుగా ఫెడరేషన్ సాగిస్తున్న పోరాటాలను వివరించారు. 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకుంటున్న సందర్భంగా మేధావులు, విద్యావంతులు, సామాజిక ప్రజా కళాకారులు, ఉపాధ్యాయులు, జిల్లాలోని ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా భారత స్వతంత్ర సమరయోధులు విప్లవ శంఖారావం షహీద్ భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జన్మోహన్ సింగ్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కుల శేఖరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీక్, గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, సత్యప్రసాద్, రవీంద్ర, ఫక్రుద్దీన్, గోవింద రెడ్డి, తిరుపాల్ నాయక్, బాలాజీ నాయక్, ఆదినారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఉద్యమంలో భాగస్వాములవ్వాలి


పండ్ల మార్కెట్‌ను శుభ్రం చేస్తున్న సెక్రటరీ గోవిందు, సూపర్‌వైజర్లు, సిబ్బంది


జెడ్పీ కార్యాలయ ఆవరణలో చెత్త ఊడుస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు


కలెక్టరేట్‌లో మొక్కకు నీరు పోస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం సిటీ: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ఒక మహా యజ్ఞం. ఉద్యమ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ చిలంకూరు ఓబుళమ్మ, డిప్యూటీ సీఈఓ లలితా బాయి సహా ఉద్యోగులు చీపుర్లు పట్టి జెడ్పీ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. వ్యక్తిగత శుభ్రతకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో, పరిసరాల పరిశుభ్రతకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారాన్ని పడేయడం శ్రేయస్కరం కాదన్నారు. పరిశుభ్రతను కాపాడుకుంటేనే మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు.

అనంతపురం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటారు. కార్యాలయం పరిశుభ్రత పనులు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, సర్వే ఏడీ రూప్లానాయక్, ఈఈ రమణారెడ్డి, కలెక్టరేట్ పరిపానాధికారి అలెగ్జాండర్, విభాగాధిపతులు వసంతలత, రిజాయుద్దీన్, సర్వే శాఖ సూపరిటెండెంట్ అయూబ్, డిప్యూటీ తహసీల్దార్లు రేఖ, ప్రభంజన్‌రెడ్డి, జయశ్రీ, సిబ్బంది కిరణ్మయి, రామప్ప, కుమారి, చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

అనంతపురం సెంట్రల్: మహాత్మగాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్టీఏ కార్యాలయ ఆవరణాన్ని పరిశుభ్రంగా మార్చారు. డీటీసీ వీర్రాజుతో పాటు ఆర్టీఓ సురేష్‌నాయుడులు స్వయంగా పరక చేతబట్టి ఊడ్చారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసులు, శ్వేత, బిందు, ప్రసాద్, ఏఓ కామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో 'స్వచ్ఛతా హీ సేవా'

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిక శ్రేణి కార్యదర్శి కె.గోవిందు ఆధ్వర్యంలో చెత్తా చెదారం, పండ్ల వ్యర్థాలను తొలగించారు. కలుపు మొక్కలు తీసేసి, చెత్తాచెదారాన్ని బయటకు తరలించారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మార్కెట్‌యార్డులో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టినట్లు సెక్రటరీ గోవిందు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేశవకుమార్, కృపారాణి, నాగేంద్ర, ఇతర క్లరికల్‌స్టాఫ్, అటెండర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ముస్తాబు

అనంతపురం కల్చరల్: నగరంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కొత్తూరు, పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. శివకోటి, శివబాలయోగి ఆశ్రమం, రెండవ రోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ నిలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ, ఐదవ రోడ్డులోని యల్లమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాలు, తాడిపత్రి బస్టాండు చౌడేశ్వరి మాత, మారుతీనగర్‌లో కొలువైన రామాలయం, మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాయలం పార్వతీ అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కాగా.. నగరంలోని శారదా శృంగేరీ శంకర మఠంలో బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.


అలంకరణలో కొత్తూరు అమ్మవారి శాల

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

అనంతపురం కల్చరల్: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆదిదేవుడి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. నగరంలోని పలు వీధులను విద్యుద్దీపకాంతులతో ముస్తాబు చేశారు. ఆర్ఎఫ్ రోడ్డులో కొలువైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శోభాయమానంగా మారి భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ తిరుమల తరహాలో పాడ్యమి నాడు బ్రహ్మోత్సవాలు ప్రారంభమై విజయదశమి తరువాత ముగుస్తాయి. పది రోజుల పాటు స్వామి వారు వివిధ అలంకారాల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అందుకు తగ్గట్టుగా శ్రీవారి ఆలయాలను ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ముస్తాబు చేశారు.

రోజుకొక వాహనంపై శ్రీవారి దర్శనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు అంటే 3న శేషవాహనం, 4న హంసవాహనం, 5న సింహవాహనం, 6న సర్వభూపాళ వాహనం, 7న గరుడ వాహనం, 8న హనుమద్ వాహనం, 9న గజవాహనం, 10న చంద్రప్రభ వాహనం, 11న అశ్వవాహనంపై స్వామి భక్తులకు దర్శనమిస్తారు. అలాగే 12న మహా రథోత్సవం జరుగుతుంది. 13న చక్రస్నానం ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవ వేడుకలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు ఏఎల్ఎన్ శాస్త్రి, కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. శ్రీనివాసనగర్‌లోని బాలాజీ మందిరం, హౌసింగ్ బోర్డు, రామనగర్ తదితర ప్రాంతాల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగనున్నాయి. పది రోజులూ రాత్రి శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి నగర వీధులలో ఊరేగి భక్తులకు దర్శనిమిస్తారు.

వ్యక్తిపై దాడి

అనంతపురం: నగరంలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్న సతీష్ అనే వ్యక్తిపై బుధవారం తెల్లవారుజామున విచక్షణా రహితంగా దాడి చేశారు. తాడిపత్రికి చెందిన సతీష్ హోటల్‌కు వెళ్తుండగా పాతూరులో కొందరు దాడి చేసి గాయపరిచారు. సెల్‌ఫోన్ దొంగలించేందుకు వచ్చాడనే అనుమానంతో చితకబాదారు. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక తర్పణాలు

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతారాధన భక్తిశ్రద్ధలతో జరిగింది. వందల సంఖ్యలో బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు పితృదేవతలకు సామూహిక తర్పణాలు వదిలారు. నిరుపేదల కిట్ల కోసం దాతలను కలిపిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వంకదారు వెంకటకృష్ణను సత్కరించారు.


ఎండ ఎక్కువగా ఉండటంతో చిన్నారికి గొడుగు సరి చేస్తున్న దృశ్యం


టవర్‌క్లాక్ వద్ద కురుస్తున్న వర్షం


వర్షంలోనే ప్రయాణిస్తున్న వ్యక్తి

ఉదయం ఎండ.. సాయంత్రం చిరుజల్లులు

నగరంలో బుధవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తరువాత మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం దాదాపు గంటసేపు వర్షం కురిసింది. నగరవాసులు వర్షంలోనే ప్రయాణిస్తూ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం లభించిందని చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: